జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ కరీంనగర్
సోమవారం 10 మార్చి 2025
www.ntnews.com


మానవ జీవితం సప్తవర్ణ సమన్వితం. ఒక్కో రంగు ఒక్కో భావానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. మానవ చేతనలో ఆలోచనలపై రంగులు ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. ఆ రంగులలో ఉన్న కళాత్మక విన్యాసం మనిషి కలలను సాకారం చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ... శ్రీ

## ఎన్నెన్నో వర్ణాలు..

- ఎరుపు అన్ని వర్ణాల కన్నా ఎక్కువగా ఉత్తేజాన్నిస్తుంది. ఉత్సాహభరితమైనది ఏదైనా ఎరుపు రంగులో ఉంటుంది. ఎరుపు ప్రేమకు చిహ్నం.
- నీలం రంగు అన్నిటినీ తనలో కలుపుకొనే తత్వం గలది. మన అవగాహనకు మించినది ఏదైనా, సాధారణంగా నీలం రంగులో ఉంటుంది. అది సముద్రం అయినా, ఆకాశం అయినా సరే.
- ఆధ్యాత్మిక మార్గంలో నడిచే వ్యక్తులు నారింజ రంగును ఎంచుకుంటారు. యోగసాధనలో ఆజ్ఞా చక్రం కదులుతున్నప్పుడు, అది నారింజ రంగులో ఉంటుంది. ఈ వర్ణం త్యాగాన్ని సూచిస్తుంది.
- శరీరంలో అత్యంత ప్రాథమిక చక్రమైన మూలాధారం వర్ణం పసుపు.
- పసుపు-నీలం నుంచి జనించేది ఆకుపచ్చ. హరిత వర్ణం ప్రశాంతమైన మనసుతో స్పష్టతను అందిస్తుంది. పచ్చ.. వృద్ధి, పునరుద్ధరణ, శాంతిని తెలియజేస్తుంది.
- తెలుపు నుంచే అన్ని రంగులూ ఉద్భవిస్తాయి. వాన వెలిశాక ఆకాశంలో ఏర్పడే హరివిల్లు పుట్టేది సూర్యుడి తెల్లని కిరణం నుంచే! తెలుపు పవిత్రతను, శాంతిని, స్వచ్ఛతను తెలుపుతుంది.






# రంగుల వేడుక.. ఆనందాల కానుక

**శిశిరంలోనే వసంత సంతసం తీసుకొచ్చే పర్వం హోళి. లేత చివుళ్లు వేసి పులకించిపోతున్న తరులతో ప్రకృతి కాంత పరవశించిపోతుంది. వసంత పంచమి నుంచి ఆమని ఆగమనానికి ప్రకృతి సిద్ధమవుతుంది. ఈ సంబురాన్ని హోళి కేళి రెట్టింపు చేస్తుంది. ఫాల్గుణోత్సవం, కల్యాణ పూర్ణిమ, వసంత పున్నమి, హుతాశని పౌర్ణమి, కాముని పున్నమి, మదనోత్సవం, డోలా పూర్ణిమ, అనంగ పూర్ణిమ ఇలా ఎన్నో పేర్లతో ఫాల్గుణ పూర్ణిమ నాడు హోళి పర్వదినాన్ని నిర్వహిస్తారు.**

హోళి పండుగతో ముడివడిన గాథలు భవిష్య, లింగ పురాణాల్లో కనిపిస్తాయి. ధర్మరాజుకు నారద మహర్షి హోళి పండుగ నియమాలను, విశిష్టతను వివరించాడని భవిష్య పురాణం చెబుతున్నది. శివపార్వతుల్ని ఏకం చేసే ప్రయత్నంలో మన్మథుడు శివుడి ఆగ్రహానికి గురై భస్మమయ్యాడు. అతని భార్య రతీదేవి ప్రార్థన మేరకు ఆమెకు మాత్రమే సశరీరంతో, మిగిలినవారికి అనంగుడిగా అంటే అదృశ్య రూపంలో మన్మథుడు గోచరమవుతాడని శివుడు వరమిచ్చాడు. ఆ సందర్భమే అనంగ పూర్ణిమ. గాథాసప్తశతి, కామసూత్రాలు, నాగావళి వంటి గ్రంథాల్లో హోళి వైభవ ప్రస్తావన ఉంది. శిశు హంతకి అయిన రాక్షసి హోళిక వినాశనానికి సూచికగా హోళి పర్వదినం ఏర్పడిందని చెబుతారు. అగ్ని కూడా దహించలేని శక్తిమంతురాలైన హోళిక హిరణ్యకశిపుడి సోదరి. ప్రహ్లాదుణ్ని ఒడిలో కూర్చోబెట్టుకుని అగ్ని ప్రవేశం చేయమని ఆమెను హిరణ్యకశిపుడు ఆదేశిస్తాడు. హరి భక్తుడైన ప్రహ్లాదుడి స్పర్శ వల్ల హోళిక శక్తి సన్నగిల్లి ఆమె అగ్నికి ఆహుతి అవుతుంది. ఆ అగ్నికీలల నుంచి ప్రహ్లాదుడు ఏ గాయమూ లేకుండా బయటికి వస్తాడు. అలాగే 'దుంధ' అనే రాక్షసి అంతానికి సంతోషంగా ప్రజలు హోళి జరుపుకొనే సంప్రదాయం ఏర్పడిందని భవిష్య పురాణ కథ.

**భారతీయ** సంస్కృతి ఒక రంగుల హరివిల్లు. కాలానికి అనుగుణంగా మనలో ఆనందాలు నింపే పండుగలతో శోభిస్తుంది. వసంత రుతువు ప్రారంభానికి ముందు వచ్చే హోళి అయితే చెప్పనే అక్కరలేదు. వయోభేదాలు మరిచి అందరూ వసంతాలాడి మైమరచే రంగుల పండుగ చేసుకుంటారు. ఆనంద హేల అయిన హోళి వెనుక సంప్రదాయ విశేషాలెన్నో ఉన్నాయి.
బృందావనంలో రాసక్రీడా వసంతోత్సవం ఓ అద్భుత రసమయ వేడుక. గోపికలపై శ్రీకృష్ణుడు వివిధ రంగుల పుష్పాలను ఆనందాతిరేకాలతో విరజిమ్మితే, గోపికలు గోపాలునిపై వసంతాన్ని చిలకరించారట. ఈ మధురోత్సవం సంరంభంగా, కవ్వింతల సంబరంగా పరిఢవిల్లిందని భాగవతం హృద్యంగా అభివర్ణించింది. అంతేకాదు, హోళి వేడుకను ఉత్తర భారతదేశంలో డోలాజాత్రాగా కూడా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా రాధాకృష్ణుల మూర్తులను ఊయలలో ఉంచి లాలిపాటలను ఆలపిస్తారు. ఆ సందర్భంగా రంగుల్ని కూడా చిలకరించుకుంటారు.
మధుర మీనాక్షి దేవి తపోదీక్షను చేపట్టి సుందరేశ్వర స్వామిని మెప్పించి ఈ ఫాల్గుణ పౌర్ణమినాడే వివాహం చేసుకుందని పురాణ కథనం. దక్షిణ భారతదేశంలో శక్తి ఆలయాల్లో ఫాల్గుణ పౌర్ణమినాడు కల్యాణీ వ్రతాన్ని నిర్వహించే ఆచారం కూడా కనిపిస్తుంది.

> "ప్రకృతిలో వ్యక్తమయ్యే వర్ణ వైవిధ్యానికి ప్రతీకగా జన సమూహం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఫాల్గుణ పూర్ణిమ నాడు రంగుల్ని చిలకరించుకుంటారు. ఆసేతు హిమాచలం ఈ పండుగను వేర్వేరు ఆచారాలతో, విభిన్న నేపథ్యాలతో, వివిధ పేర్లతో నిర్వహించుకుంటారు. ఫాల్గుణ పౌర్ణమికి కాస్త అటూ ఇటూగా ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి సంబంధమైన పండుగల్ని నిర్వహించుకునే సంప్రదాయం ఉంది. ప్రాంతమేదైనా, ఏ తరహాలో పండుగ చేసుకున్నా.. అది మత సామరస్యానికి, సమైక్యతకు చిహ్నంగా నిలుస్తున్నది."

### పర్యావరణ హితం

వేదకాలంలో హోళిని 'నవాహ్నేష్టి యజ్ఞం'గా జరుపుకొనేవారు. పొలంలో సగం పక్వమైన, సగం పచ్చిగా ఉన్న ధాన్యాన్ని తెచ్చి హోమాగ్నిపై ఆవుపాలతో పాయసం తయారుచేసేవారు. పురాణకాలం నుంచి హోళినాడు వసంతాలాడే ఆచారం వచ్చింది. ప్రకృతి సహజమైన రంగులతోనే హోళి జరుపుకోవాలి. హానికరమైన కృత్రిమ రంగులు చల్లుకోవడం సంప్రదాయ విరుద్ధం. ఫల, పుష్ప రసాలను సమ్మిళితం చేసి రంగులుగా చిలకరించుకోవచ్చు. పసుపు కలిపిన చందనం, అష్టగంధం, వృక్షమూలాల రసం, మోదుగ పుష్పాల గుజ్జు, మందార పువ్వులు, గులాబీ పువ్వుల నుంచి తీసిన రసం కలిపిన జలాన్ని హోళి రంగులుగా వినియోగించడం మన సంప్రదాయం. పర్యావరణ హితంగా హోళి నిర్వహించడం వల్ల శరీరానికీ, మనసుకు ఆహ్లాదం చేకూరుతుంది. మొత్తంగా ఈ పండుగ అంతరార్థం అందరూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటమే.

... టి.శ్యామ్‌ప్రసాద్

# స్థితప్రజ్ఞతే.. నాయకుడి సమర్థత

*దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః*
*వీతరాగ భయక్రోధః స్థిత ధీర్మునిరుచ్యతే!*
(భగవద్గీత - 2-56)

**స్థితప్రజ్ఞుడి** లక్షణాలను గురించి ప్రశ్నించిన అర్జునునితో.. కృష్ణ పరమాత్మ.. 'దుఃఖాలకు కుంగిపోనివాడు, సుఖాలకు పొంగిపోనివాడు, ఆసక్తిని, భయక్రోధాలను వీడినవాడు అయిన మననశీలుడు.. స్థితప్రజ్ఞుడిగా చెప్పబడుతాడు' అంటాడు.
ఏ వ్యక్తీ కేవలం పుట్టడం.. బతకడం.. మరణించడం కోసం ఈ భూమిపైకి రాలేదు. అనంతమైన శక్తిసామర్థ్యాలతో, ఉన్నతమైన దార్శనికతతో, విస్తారమైన ఆలోచనలతో, ఉదాత్తమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు జన్మించాడు. ప్రతివ్యక్తీ తన ఆశయాలను సాకారం చేసుకుంటూ, తనదంటూ ప్రత్యేకతను చాటుకునేందుకు భూమిపైకి వచ్చాడు. ప్రపంచాన్ని సుసంపన్నం చేయడం, తన జీవితాన్ని ఉన్నతీకరించుకోవడం లక్ష్యంగా వ్యక్తి సాధన సాగాలి. ఆ లక్ష్యాన్ని విస్మరించిన వ్యక్తి మనసు బలహీనతకు ఆవాసమైనట్టుగానే భావించాలి. ఆ లక్ష్యాన్ని గుర్తించిన వ్యక్తి నాయకుడిగా భావితరాలకు మార్గదర్శకుడై నిలుస్తాడు.

**సత్యమనేది** ఒక్కటే.. చూసే దృష్టి కోణాలలో భేదం ఉంటుంది. నా దృష్టే అంతిమం అనుకుంటే వివాదాలు తలెత్తుతాయి. ఎదుటివారి కోణాన్నీ అవగాహన చేసుకునేందుకు ప్రయత్నిస్తే.. అది సంవాదమై.. ఇరువురి అవగాహనను ఉన్నతీకరిస్తుంది. నాయకుడిలో ఆ సంయమనం ఉండాలి. ఉత్తమ నాయకుడైన కృష్ణుడు... అర్జునుడి దృష్టిపరిధిని పెంచే క్రమంలో చేసిన బోధ, పరివర్తన చెందాలనుకునే ఈనాటి నాయకులకు దారిచూపుతుంది.

**సంస్థలో** నాయకుడు స్థితప్రజ్ఞత సాధిస్తేనే ఉత్తమ ఫలితాలను సాధించగలుగుతాడు. స్వీయ నియంత్రణ, మానసిక సమతుల్యత, అంతర్గత శక్తిసామర్థ్యాల వినియోగం, భావోద్వేగాలకు అతీతంగా స్థిరమైన మానసిక చైతన్యాన్ని పెంపొందించుకునే నాయకుడు ఎన్ని ఒడుదొడుకులు, ఒత్తిడులు ఎదురైనా కలతపడకుండా లక్ష్యాలను అధిగమించేందుకు ముందుకు సాగుతాడు. నిజానికి సంతోషం దుఃఖం రెండూ సాపేక్షాలే. అవి నాణానికి రెండు ముఖాలు. మనం ఒక ముఖాన్ని చూస్తున్నామంటే మరొక ముఖం పలకరించడానికి వేచి ఉన్నట్లే కదా! ఆంతరంగిక బలాబలాలను గుర్తించి.. వాటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వల్ల ప్రశాంతతను సంతరించుకుంటాం. ప్రశాంతత వల్ల ఫలితాలపై కాకుండా ప్రక్రియపై దృష్టిని కేంద్రీకరించడం జరుగుతుంది. ఆత్మ నిగ్రహం, స్పష్టత, నిర్భయత, తప్పులను గుర్తించి సరి చేసుకోవడం, క్షమా గుణం, దృఢ సంకల్పం, నిరాడంబరత లాంటి లక్షణాలు అలవడుతాయి. స్వీయ అవగాహనను పెంచుకోవడం వల్ల ప్రతికూల శక్తుల ప్రభావానికి లొంగిపోవడం జరగదు. అంతర్ దృష్టి అలవడడం వల్ల దార్శనికత పెరుగుతుంది.

**నాయకత్వం** ఎప్పుడూ ఆకర్షణీయమైన వ్యక్తిత్వం కాదు, ప్రయోజన రహితంగా మాట్లాడటమూ, వల్లించడమూ కాదు. ఎక్కువమంది స్నేహితులను సంపాదించడమో లేదా చుట్టూ ఉన్న జనాలను ప్రభావితం చేయడమో, ముఖస్తుతులకు పొంగిపోవడమో, ముఖస్తుతులను చేయడమో నాయకత్వం కాదు. నాయకత్వం అంటే అనుచరుల దృష్టికోణాన్ని ఉన్నతీకరించడం. వారి ఆలోచనా పరిధిని విస్తరింపచేయడం. వారి పనితీరును, సామర్థ్యాన్ని ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం. అనుచరులు తమ సాధారణ స్థాయి సామర్థ్యాన్ని అసాధారణ స్థాయికి పెంచుకునేందుకు అవసరమైన ఉత్ప్రేరకంగా పనిచేయడం! సకారాత్మకమైన వ్యక్తిత్వాన్ని వారు సంతరించుకునే వాతావరణాన్ని కల్పించడం.

గీతాసారం



**ప్రతిభావంతుడైన** నాయకుడు ఒంటరిగా నిలవగలిగిన ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉంటాడు. అవసరమైన సమయంలో ఎలాంటి కఠినమైన నిర్ణయాలనైనా తీసుకునే ధైర్యం అతని సొంతం. అంతేకాదు, సహానుభూతితో ఎదుటివారి కష్టసుఖాలకు స్పందించడం, ప్రేమాభిమానాలతో, అవసరమైన సహకారాన్ని అందించడం నాయకుడి లక్షణంగా ఉంటుంది. తాను నాయకుడనని చెప్పుకోవడం నాయకత్వ లక్షణంకాదు. నాయకుడి సమర్థత.. అతని చర్యల ద్వారా సమగ్రతను, సమానతను సంతరించుకొని.. అందరినీ ఒక్కతాటిపై నడపడంలో వెల్లడవుతుంది. నిజానికి మార్గం తెలిసినవాడే నిజమైన నాయకుడు! తాను ఆ మార్గంలో గమిస్తాడు, అనుచరులకు మార్గం చూపుతాడు. అలాంటి దృక్పథాన్ని సంతరించుకుంటే స్థితప్రజ్ఞత అలవడుతుంది. దానితో నాయకత్వం తనంతట తానే వరించి వస్తుంది.

... పాలకుర్తి రామమూర్తి

క్రీస్తు సందేశం

## పశ్చాత్తాప శ్రమ దినాలు

**మానవుడు** ఎంతటి మహనీయుడో, తప్పులు చేసి అంతటి బలహీనుడైపోతాడు కూడా. ఆ బలహీనత నుంచి మళ్లీ కోలుకోవాలి. తిరిగి శక్తిని పుంజుకోవాలి. ఇక్కడే ప్రతి మనిషీ తన మతాన్ని, దైవశక్తినీ ఆశ్రయిస్తాడు. ఈ ప్రక్రియలో భాగంగా ఒక్కో మతం ఒక్కో రకమైన నియమాలు సూచిస్తున్నది. క్రైస్తవ సమాజం నలభైరోజులపాటు క్రీస్తుకు శిలువ వేసిన సంఘటనలు ధ్యానించుకొంటుంది. శుభ శుక్రవారానికి కచ్చితంగా నలభై రోజుల ముందు నుంచే ఈ నియమాలు పాటిస్తారు. ప్రభువు మరణానికి సంబంధించి ఆయన ప్రజల కోసం పడిన పాట్లు ధ్యానించుకుంటారు. ఈ నేపథ్యంలో తాము చేసిన తప్పులు, పాపాలను తలుచుకుంటారు. అంటే అబద్ధాలు ఆడటం దగ్గర నుంచి ఇతరుల్ని మోసం చేయడం, హింసించడం, ద్వేషించడం, సోమరితనానికి అలవాటు పడి ఇతరుల శ్రమను దోచుకోవడం లాంటి దుష్కార్యాలను సంస్కరించుకుంటారు. ఇలాంటి పనులు ఇక మీదట చేయకూడదని మనసు మార్చుకొనే ప్రయత్నం చేస్తారు. తమ ప్రవర్తనను మార్చుకోవడానికి ప్రభువు బోధనలను స్మరించుకుంటారు. ఇందుకోసం ఈ నలభై రోజులను ఆధ్యాత్మికంగా గడిపే ప్రయత్నం చేస్తారు. క్రైస్తవ సమాజం ఈ నలభై రోజులను పశ్చాత్తాప శ్రమ దినాలుగా పేర్కొన్నది. ఈ కాలంలో క్రీస్తుకు దగ్గర కావడానికి కొంత శ్రమపూరిత జీవన విధానంతో, చిత్తశుద్ధితో పాటించి తీరాలని నిర్ణయించుకొంటారు. ముఖ్యంగా విలాసవంతమైన ఆహారపానీయాలకు దూరంగా ఉంటారు. సుఖసౌఖ్య భోగాల్ని తగ్గించుకుంటారు. త్యాగమయ జీవనాన్ని కొనసాగిస్తారు. ఉపవాసాలు ఆచరిస్తారు, ఉపదేశాలను వింటారు. జీవన విలువ తెలుసుకొని, జీవిత పరమార్థం సాధించుకోడానికి ప్రయత్నిస్తారు.

... ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024

సనాతనం

## ధ్వజస్తంభంలో ఉన్నదెవరు?

**భారత** యుద్ధానంతరం సింహాసనాన్ని అధిష్ఠించిన ధర్మరాజు అధర్మానికి తావులేకుండా రాజ్యపాలన చేస్తున్నాడు. ధర్మమూర్తిగా, ఎదురులేని దాతగా కీర్తి పతాకం అందుకోవాలనే కాంక్షతో ఎడతెరిపి లేకుండా దానధర్మాలు చేయడం మొదలుపెట్టాడు. ఇది గమనిస్తున్న కృష్ణుడు అతనికి తగు గుణపాఠం నేర్పాలనుకున్నాడు. ధర్మరాజుకి అశ్వమేధ యాగం చేయమని సలహా ఇస్తాడు. శ్రీకృష్ణుడి మాట శిరసావహించి యాగం చేస్తాడు ధర్మరాజు. నకుల సహదేవులు సైన్యంతో యాగ అశ్వరక్షకులుగా బయలుదేరుతారు. ఆ యాగాశ్వం చివరికి మణిపుర రాజ్యం చేరుతుంది. ఆ రాజ్యాన్ని మయూరధ్వజుడు పాలించేవాడు. ఆయన మహా పరాక్రమవంతుడు, గొప్ప దాతగా పేరుపొందాడు. మయూరధ్వజుని కుమారుడైన తామ్రధ్వజుడు పాండవుల యాగాశ్వాన్ని బంధిస్తాడు. తామ్రధ్వజునితో యుద్ధం చేసిన నకుల సహదేవులు, భీమార్జునులు ఓడిపోతారు.
తమ్ములు ఓడిన విషయం తెలిసిన ధర్మరాజు స్వయంగా బయలుదేరగా కృష్ణుడు అతణ్ని వారిస్తాడు. మయూరధ్వజున్ని జయించేందుకు ఒక కపటోపాయాన్ని చెబుతాడు. దాని మేరకు శ్రీకృష్ణుడు, ధర్మరాజు ఇద్దరూ వృద్ధ బ్రాహ్మణుల రూపంలో మణిపురం చేరుతారు. మయూరధ్వజుణ్ని కలుస్తారు. 'దానం కోరుకోమంటాడు' రాజు. అందుకు శ్రీకృష్ణుడు 'రాజా! తమ దర్శనార్థమై మేము వస్తున్న దారిలో ఒక సింహం అడ్డువచ్చి ఈ బ్రాహ్మణుడి కుమారుడిని పట్టుకుని చంపబోయింది. బాలుని విడిచిపెట్టవలసిందని ప్రార్థించాము. అప్పుడు సింహం మానవ భాషలో 'మీ కుమారుడు మీకు కావాలంటే మణిపుర రాజ్యాధిపతి మయూరధ్వజుని శరీరంలో సగభాగం నాకు ఆహారంగా ఇప్పించమ'ని కోరింది. ప్రభువులు మా యందు దయదలచి తమ శరీరంలో సగభాగం దానమిచ్చి బాలుణ్ని కాపాడమ'ని కోరుతాడు. ఆ మాటలు విని అందుకు మయూరధ్వజుడు అంగీకరిస్తాడు. అతని భార్యాపుత్రులే స్వయంగా కోసివ్వాలనే నియమాన్ని కూడా విధిస్తాడు కృష్ణుడు. అందుకు తగినట్లుగానే భార్యాపుత్రులు మయూరధ్వజుడి శరీరాన్ని సగానికి కోస్తారు. ఆ దృశ్యం చూసిన ధర్మరాజు.. ఆ మహారాజు దానగుణానికి నివ్వెరపోతాడు.



ఇంతలో మయూరధ్వజుని ఎడమకన్ను నుంచి నీరు రావటం గమనించిన ధర్మరాజు 'తమరు కన్నీరు కారుస్తూ ఇచ్చిన దానం మాకు వద్దు గాక వద్దు అన్నాడు. అందుకు మయూరధ్వజుడు 'మహాత్మా! తమరు పొరపాటుపడ్డారు. బాధపడి నా శరీరాన్ని మీకివ్వటం లేదు. నా కుడి భాగం పరోపకారానికి ఉపయోగపడింది. కానీ, ఎడమభాగానికి ఆ భాగ్యం నాకు కలుగలేదు కదా అని ఎడమకన్ను బాధపడుతున్నది' అంటూ వివరిస్తాడు. ఆశ్చర్యపోతాడు ధర్మరాజు.


మయూరధ్వజుడి దానశీలతకు మెచ్చిన శ్రీకృష్ణుడు తన నిజరూపాన్ని చూపి ఏదైనా వరం కోరుకోమన్నాడు. 'పరమాత్మా! నా శరీరం నశించినా నా ఆత్మ పరోపకారార్థం ఉపయోగపడేలా నిత్యం మీ ముందు ఉండేటట్లు దీవించండి' అని కోరుకున్నాడు మయూరధ్వజుడు. తథాస్తు అంటూ వరమిస్తాడు వాసుదేవుడు. 'మయూరధ్వజా! నేటి నుంచీ ప్రతి దేవాలయం ముందునూ గుర్తుగా నీ పేరున ధ్వజస్తంభాలు వెలుస్తాయి. వాటిని ఆశ్రయించిన నీ ఆత్మ, నిత్యం దైవసాన్నిధ్యంలో ఉంటుంది. ముందు నిన్ను దర్శించి ప్రదక్షిణ నమస్కారాలు ఆచరించిన తర్వాతనే ప్రజలు తమ ఇష్టదైవాలను దర్శించుకుంటారు. నిత్యం నీ దగ్గర దీపం ఎవరు ఉంచుతారో వారి జన్మ సఫలం అవుతుంది. నీ శిరస్సు మీద ఉంచిన దీపం రాత్రి సమయాల్లో బాటసారులకు దారి చూపే దీపం అవుతుంది' అంటూ అనుగ్రహించాడు. ఆనాటి నుంచీ ఆలయాల ముందు ధ్వజస్తంభాలు విధిగా ప్రతిష్ఠించడం ఆచారంగా మారింది.

... శ్రీ భారతి

# దైవారాధన మార్గం జకాత్

ఇస్లాం బోధ

**పవిత్ర** రంజాన్ మాసంలో ముస్లింలు జకాత్‌ను విధిగా ఆచరించాలి. జకాత్ అంటే తమ ఏడాది సంపాదనలో రెండున్నర శాతాన్ని నిరుపేదల కోసం ఖర్చు పెట్టడం. జకాత్ అంటే పవిత్రత, పరిశుద్ధత అని కూడా అర్థం. నమాజ్‌లాగా జకాత్ కూడా విధిగా ఆచరించాల్సిన ధర్మం. దీని ద్వారా చేసే దైవారాధన అత్యుత్తమమైనది. జకాత్ ద్వారా సంపన్నుల నుంచి వసూలు చేసిన ధనం నిరుపేదలకు చేరుతుంది. సత్యాన్ని విశ్వసించి, జకాత్ విధిని నెరవేర్చేవారికి ఎలాంటి దుఃఖం, భయం ఉండవని ఖురాన్ ప్రవచిస్తున్నది. ఆర్థిక స్తోమత కలిగిన ముస్లింలు తమ సంపద నుంచి విధిగా జకాత్ తీసి ఇస్లామీయ ప్రభుత్వానికి చెల్లించాలి. అలాంటి ప్రభుత్వం లేని చోట విధిగా వ్యక్తిగతంగా గానీ, సంఘం ద్వారా గానీ అర్హులైన వారికి దానాలు చేయాలి. ముస్లింల ప్రాపంచిక వ్యామోహాన్ని నిర్మూలించి, వారి హృదయాల్లో దైవ ప్రేమను మొలకెత్తించేందుకు జకాత్‌ను ఏర్పాటుచేశారు. సమాజంలో ప్రజలందరికీ ఆర్థిక న్యాయాన్ని చేకూర్చాలన్నదే దీని ప్రధాన ఉద్దేశం.




**మనుషుల** మనుగడ కోసం అల్లాహ్ అనేక సంపదలను ప్రసాదించాడు. అందుకుగాను అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. ఆయన మనకు ఇచ్చిన సంపదల్లో కొంతభాగం పేదలైన తోటి మానవులకు అందించాలి. ధాన్యం, పప్పులు, కూరగాయలు, పండ్లు.. ఇలా భూమిలో పండే పదార్థాలతోపాటు ధన, కనక, వస్తు, వాహన, వస్త్ర, వంట సామగ్రి ఉత్పత్తులను దానం చేయాలి. ఈ నేపథ్యంలో మన సంపదను జకాత్ ద్వారా సద్వినియోగం చేస్తేనే మనం దైవ ప్రసన్నతను పొందుతాం. జకాత్ వల్ల మనలో స్వార్థం, లోభం, అసూయ, ద్వేషం, దోపిడి లాంటి చెడు గుణాల నిర్మూలన జరుగుతుంది. ప్రేమ, పరోపకారం, త్యాగం, సానుభూతి, సహకారం, స్నేహం, చిత్తశుద్ధి, ఔదార్యం లాంటి సద్గుణాలు పెంపొందుతాయి. జకాత్ ఇస్లాం సౌధానికి మూల స్తంభం. ఇది ఒక ధన సంబంధమైన దైవారాధన!

- జకాత్ ఇవ్వడానికి కొన్ని షరతులు, విధి విధానాలను ఏర్పరిచారు. జకాత్ ఇచ్చే వ్యక్తి వయోజనుడై ఉండాలి. కనీస సంపదలు కలిగిన ధనవంతుడై ఉండాలి. సంపద లభించిన ఏడాది తర్వాత దానం చేయాలి. జకాత్ చేసేవారు అప్పులు చేసి ఉండకూడదు.
- స్థిరాస్తులు, భూములు, నవరత్నాలు, యంత్రాలను, సొంత అవసరాలకు వాడే వాహనాలను జకాత్ ఇవ్వాల్సిన అవసరం లేదు. పెంపుడు పశువులను కూడా ఖురాన్‌లో నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ ఉంటే జకాత్ ఇవ్వవచ్చు.
- పంటల ఉత్పత్తుల్లో పది శాతం 'ఉష్ర్' రూపంలో జకాత్ ఇవ్వాలి. అర్హులైన వారికి జకాత్ ఇస్తున్నప్పుడు జకాత్ ఇస్తున్నానని మనసులో సంకల్పించుకోవాలి. దానాన్ని స్వీకరించే వ్యక్తిని జకాత్ యజమానిగా భావించాలి.
- ఆత్మాభిమానం కలిగిన నిరుపేదలు, ఫకీర్లు, జకాత్ వసూలు చేసే ఉద్యోగులు దానాన్ని స్వీకరించవచ్చు. బానిసల విముక్తి కోసం, అప్పులు ఉన్నవారిని రుణ విముక్తుల్ని చేయడం కోసం, నిర్ధనులైన బాటసారులను ఆదుకోవడానికి జకాత్ ధనాన్ని ఖర్చు పెట్టవచ్చు.
- ధర్మ సంస్థాపన కోసం, ధర్మ ప్రచారం కోసం దైవ మార్గంలో చేసే పనులకు జకాత్ ఖర్చు చేయవచ్చు. సొంత పనులు చేయించుకొని వాటికి ప్రతిఫలంగా జకాత్ ఇవ్వకూడదు.
- ఏడున్నర తులాల బంగారం లేదా దానికి తగ్గ విలువైన సంపద ఏడాదిపాటు నిల్వ ఉన్న ప్రతీ ధనవంతుడూ విధిగా జకాత్ చెల్లించాలని ఖురాన్ పేర్కొన్నది.

.. ముహమ్మద్ ముజాహిద్
96406 22076